క్లుప్తంగా

వైభవంగా గంధమహోత్సవం



ఆస్థాన ఏ నూరియా నుంచి గంధాన్ని తీసుకెళ్తున్న నిర్వాహకులు

సంగం: మండలంలోని దువ్వూరులో శ్రీహజరత్ సయ్యద్ మొహమ్మద్ ఖాజాబందా నవాజ్ గేసు దరాజ్ రహమతుల్లా అలై గుల్బార్గా గంధమహోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. తొలుత ఆస్థాన ఏ నూరియాలో గంధాన్ని కలిపి సిద్ధం చేశారు. అనంతరం ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు గంధాన్ని పంచారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆస్థాన ఏ నూరియా కమిటీ సభ్యులు భక్తుల పాల్గొన్నారు.

నేడు మోడల్ స్కూల్ ప్రవేశానికి పరీక్ష



ఉచిత శిక్షణా తరగతులకు హాజరైన విద్యార్థులు

కలిగిరి: కలిగిరిలోని ఏపీ మోడల్ స్కూల్‌లో 2023–24 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ అన్నవరపు శ్రీనివాసులు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో 76 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్షకు సన్నద్ధం చేయడానికి రెండు రోజులు నిర్వహించిన ఉచిత శిక్షణా తరగతులకు 60 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

భిన్నాలపై అవగాహన



విద్యార్థులతో భిన్నాలు చెప్పిస్తున్న దృశ్యం

చేజర్ల(సోమశిల): వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల్లో భాగంగా శనివారం అనంతసాగరం గ్రంథాలయంలో విద్యార్థులకు భిన్నాలపై శిక్షణ ఇచ్చారు. సాధారణ, దశాంశ భిన్నాలు ఎలా వేయాలో లైబ్రేరియన్ నారాయణరావు చేసి చూపించారు. అనంతరం విద్యార్థులకు లెమన్ స్పూన్, బాల్ అండ్ బిన్ ఆటలు నిర్వహించారు.

చెట్టు నరికివేతపై అటవీ అధికారుల సీరియస్



వేప చెట్టును కూల్చివేస్తున్న కూలీలు

ఆత్మకూరు: పట్టణంలోని వెంకట్రావుపల్లికి పొలాలకు వెళ్లే దారిలో ప్రభుత్వ భూమిలో ఉన్న ఓ పెద్ద వేప చెట్టును కొందరు శనివారం నరికివేశారు. దీంతో స్థానికులు అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు సామాజిక మాధ్యమాల్లో ఈ విషయాన్ని వైరల్ చేశారు. దీంతో అటవీశాఖ జిల్లా అధికారి డీఎఫ్ఓ చంద్రశేఖర్ ఈ విషయమై స్థానిక అటవీశాఖ అధికారులను పరిశీలించి కేసు నమోదు చేయాలని ఆదేశించారు. ఏళ్ల తరబడి ఉన్న పెద్ద చెట్టును నరికివేయడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలి



పంపిణీ చేస్తున్న దృశ్యం

కావలి: గర్భిణులు, బాలింతలు, కిషోర్ బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలని వెంగళరావు నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యురాలు డాక్టర్ రమ్య సూచించారు. పట్టణంలోని డాక్టర్ రామ్‌సెంటర్ విశోదయ ఆధ్వర్యంలో శనివారం వెంగళరావునగర్ కొత్త శివాలయం దగ్గర అంగన్‌వాడీ కేంద్రంలో వైద్య శిబిరం జరిగింది. ఆమె గర్భిణులు రక్తహీనత లేకుండా చూసుకోవాలని, లింగ వివక్ష ఉండరాదని చెప్పారు. గర్భిణులు, బాలింతలకు ఐరన్ పోలిక్, కాల్షియం, విటమిన్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహరరెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి, కమ్యూనిటీ ఆర్గనైజర్ ప్రసాద్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు

పల్లె వాకిట్లో సర్కార్ సేవలు

సచివాలయం వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం

ప్రభుత్వ సేవలు కావాలంటే.. మండల కేంద్రాలకు పరుగులు పెట్టే రోజులు. పనులు మానుకుని వ్యయ ప్రయాసలు పడి రోజులు.. నెలల తరబడి తిరిగినా ఫలితం దక్కని పరిస్థితులు. అటెండర్ నుంచి అధికారి వరకు చేయి తడిపితే కానీ పనులు కాని రోజులు. ఇదంతా గతం.

.. మూడున్నరేళ్ల క్రితం పురుడు పోసుకున్న గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ గతాన్ని మార్చేసింది. ఊరు, వార్డు దాటకుండానే ఇంటి ముంగిట్లోనే వ్యయ ప్రయాసలు లేకుండా.. రూపాయి లంచం ఇవ్వకుండా పౌర సేవలు నిర్దిష్ట సమయానికి పొందుతున్న పరిస్థితి. ఇదీ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తెచ్చిన ఘనమైన మార్పు.

తల్లిదండ్రులే వదిలేశారు..



ఈ ఫొటోలో ఉన్న బాలిక పేరు తలమంచి సుచిత్ర. కావలి మండలం కొత్తపల్లి గ్రామం. సుచిత్ర మానసిక వికలాంగురాలు. 11 నెలలు వయస్సు ఉన్నప్పుడు తల్లిదండ్రులే ఆ బాలిక తమకు వద్దని చెప్పి, నాయ నమ్మ వద్ద వదిలేసి వెళ్లిపోయారు. మనవరాలు కావడంతో నాయనమ్మ ఈ బాలికను 11 నెలల వయస్సు నుంచి ఇప్పుడు 17 సంవత్సరాలు వచ్చినా అన్నీ సపర్యలు చేస్తూనే ఉంది. గత టీడీపీ ప్రభుత్వంలో గ్రామంలో పింఛన్ నగదు తెచ్చుకోవడానికి బాలికను ఎత్తుకుని నాయనమ్మ చాలా దూరంగా వెళ్లాల్సి వచ్చేది. రోజుల తరబడి పడిగాపులు కాయాల్సి ఉండేది. పింఛన్ ఇస్తున్నారంటే బాలికను మోయలేక, పింఛన్ ఇస్తున్న చోటకు తీసుకెళ్లలేక, ఎదురు చూపులు చూడలేక అవస్థలు పడుతుండేది. కానీ ఇప్పుడు ప్రతి నెల 1వ తేదీ ఉదయాన్నే వలంటీర్ బాలికకు నాయనమ్మ సమక్షంలో నాయనమ్మ ఇంట్లోనే పింఛన్ నగదులు రూ.3,000 ఇస్తుండడంతో మా అదృష్టం వల్లనే ఈ ప్రభుత్వం వచ్చిందంటూ బాలిక నాయనమ్మ సంతోషం వ్యక్తం చేసింది.

- ఊరు, వార్డు పొలిమేర దాటకుండానే సమస్యలకు పరిష్కారం
- కాణీ ఖర్చు.. లంచాలతో పని లేకుండా నిర్దిష్ట వ్యవధిలో సేవలు
- వలంటీర్ల వ్యవస్థతో ఇంట్లో కూర్చొనే పౌర సేవలు పొందుతున్న వైనం

కావలి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. చరిత్రలో కొత్త అధ్యాయం మొదలైంది. జాతిపిత మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని తెచ్చింది. ఊరు ఊపిరి తీసుకుంది. పల్లె మురిసింది. ఇదిగో.. అదిగో గ్రామ స్వరాజ్యమంటూ పాలకులు దశాబ్దాలుగా ఊదరగొట్టారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన నాలుగు నెలల్లోనే గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలకు శ్రీకారం చుట్టారు. 2 అక్టోబర్ 2019 తేదీన జాతిపిత 150వ జయంతి నాడు దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్ఫూర్తిగా నిలిచింది. దేశంలో ఇప్పటి వరకు ఎక్కడా లేని విధంగా గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను తెచ్చింది. అవినీతికి, వివక్షకు తావు లేని స్వచ్ఛమైన పరిపాలనకు బీజం వేశారు.

ప్రతి పనికి మండల కేంద్రాలకు..

దశాబ్దాలుగా ఏ పని కావాలన్నా.. మండల కేంద్రాల్లోని రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాలకు పరుగులు పెట్టే పరిస్థితి ఉండేది. ఆదాయ, నివాస ధ్రువీకరణ సర్టిఫికెట్లు.. రేషన్‌కార్డు, ఇంటి స్థలం.. రెవెన్యూ భూ సమస్యలు పరిష్కారం కావాలన్నా.. ముందు వీఆర్వో, ఆ తర్వాత ఆర్ఐ, చివరగా తహసీల్దార్ వద్దకు తిరగాల్సిన పరిస్థితి. పింఛన్ కావాలన్నా.. తాగునీటి సమస్యలు, ఇళ్ల మంజూరు కావాలన్నా.. ఎంపీడీఓ చుట్టూ ప్రదక్షిణాలు చేయాల్సి ఉండేది. ఇందు కోసం రోజుల తరబడి ఆయా కార్యాలయాల చుట్టూ పనులు మానుకుని తిరగాల్సిన పరిస్థితి. అయినా పనులు అవుతాయంటే కింది స్థాయి నుంచి పై స్థాయి వరకు ముడుపులు ఇచ్చుకుంటేనే. ఇది గతం.

ఇంటి ముగింట్లో.. 72 గంట్లోనే

గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ ప్రాణం పోసుకోవడంతో ఇప్పుడా ఆ బెంగ తీరింది. కావలి మండలంలో 16, పట్టణంలో 28 సచివాలయాలు ఆవిష్కృతమయ్యాయి. సచివాలయాల్లో దాదాపు 35 ప్రభుత్వ శాఖలకు సంబంధించి 500 సేవలు అందుబాటులోకి. సేవల కోసం పనులు మానుకోవాల్సిన అవసరం లేకుండా పోయింది. సమస్య ఏదైనా సరే గ్రామ/వార్డు సచివాలయాల్లో అర్జీ పెట్టుకున్న 72 గంటల్లోనే సమస్యను పరిష్కరించే విధంగా వ్యవస్థను రూపొందించారు.

వలంటీర్లు అన్నీ తామై..

గ్రామ/వార్డు పరిధిలో ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీర్ ఏర్పాటు కావడంతో వారే ఆ కుటుంబానికి అవసరమైన సేవలను అన్నీ తామై నెరవేర్చుతున్నారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ తమకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందలేదని బాధపడే సమస్యను తీర్చారు. గ్రామ, వార్డు సచివాలయాలు వచ్చిన తర్వాత స్థానిక పాలనలో వేగం, పారదర్శకత, కచ్చితత్వం పెరిగింది. అర్హులైన ప్రతి ఒక్కరి ఇంటి తలుపులు తట్టి మరీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ప్రభుత్వం ఒక ఆంధ్రప్రదేశ్ లోనే తప్పమరెక్కడా లేదు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధులుగా వాలంటీర్లు ఎలాంటి అవినీతికి తావు లేకుండా కుల, మత, వర్గ, వర్ణ, లింగ, రాజకీయ వివక్షకు తావు లేకుండా ప్రజల ఇంటి ముంగిటే ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్నారు.

రూ.40 లక్షలతో ఒక్కో సచివాలయం

సచివాలయాలను తొలుత తాత్కాలికంగా అద్దె భవనాల్లోనూ, ప్రభుత్వ భవనాల్లోనూ ఏర్పాటు చేశారు. అయితే సచివాలయ సేవలకు అనుగుణంగా ఆధునిక వసతులతో సొంత భవనాల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఒక్కొక్క సచివాలయాన్ని రూ.40 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తోంది. మండలంలో 16 సచివాలయాలు ఉండగా కొత్తపల్లి, రుద్రకోట, చెన్నాయపాళెం, అన్నగారిపాళెం-1, తాళ్లపాళెం, చలంచర్ల గ్రామాల్లో సొంత భవనాలు పూర్తి చేసి అందులో నుంచే సేవలు అందిస్తున్నారు. గౌరవరంలో సొంత భవన నిర్మాణం పూర్తయింది. ఆముదాలదిన్నె, చెంచుగానిపాళెం, పెద్దపట్టపుపాళెం, సర్వాయపాళెం, తుమ్మలపెంట-1 గ్రామ సచివాలయాలు భవనాలు నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయి. జిల్లాలోనే మండలంలోని కొత్తపల్లి సచివాలయం మొట్టమొదట నిర్మాణం పూర్తి చేసుకున్న చరిత్రను లిఖించుకుంది. కావలి పట్టణంలో 28 సచివాలయాలు ఉండగా, అందులో ఇందిరానగర్, ముసునూరు-1, దంతంవారి వీధి, రైల్వేస్టేషన్ రోడ్డు, మద్దూరుపాడు వార్డు సచివాలయాలు మున్సిపాలిటీకి చెందిన సొంత భవనాలను ఆధునీకీకరించి నిర్వహిస్తున్నారు. మిగిలినవి అద్దె భవనాల్లో ఉన్నాయి. సొంత భవనాల నిర్మాణానికి సర్వం సిద్ధమైంది.



జిల్లాలో మొట్ట మొదటి నూతన గ్రామ సచివాలయం భవనంగా నిర్మితమైన కావలి మండలం కొత్తపల్లి గ్రామ సచివాలయం

మూడున్నర ఏళ్లలో..

కావలి పట్టణం	
వార్డు సచివాలయాలు	-28
అందిన అర్జీలు	-50,209
పరిష్కరించిన అర్జీలు	-46,733
అత్యధిక అర్జీలు రెవెన్యూవి	-25,942
పరిష్కరించిన అర్జీలు	-24,439
కావలి మండలం	
వార్డు సచివాలయాలు	-16
అందిన అర్జీలు	-27,297
పరిష్కరించిన అర్జీలు	-25,235
అత్యధిక అర్జీలు రెవెన్యూవి	-16,181
పరిష్కరించిన అర్జీలు	-15,028

అడగకుండానే.. పింఛన్ మంజూరు



గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ కోసం మా ఊరు నుంచి 12 కి.మీ. దూరంలోని కావలికి వెళ్లి తహసీల్దార్, మండల అభివృద్ధి అధికారి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశాను. అన్ని అర్హతలు ఉన్నా..అధికారులు పింఛన్ మంజూరు చేయలేదు. జన్మభూమి కమిటీ ప్రతి సారి అడ్డుకుంది. దీంతో విసిగిపోయి ఇక ఈ జన్మకు నాకు ప్రభుత్వ పింఛన్ రాదని నిరాశ నిస్పృతో మిన్నుకుండిపోయాను. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాగానే సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు నా వద్దకు కూడా వచ్చారు. నాకు వృద్ధాప్య పింఛన్ మంజూరుకు అర్హత ఉందని వివరాలు తీసుకున్నారు. పింఛన్ మంజూరు చేశారు. నాకు వృద్ధాప్య పింఛన్ మంజూరైందని సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ పొద్దు పొద్దున్నే మా ఇంటికి వచ్చి చెప్పారు. నేను అడగకుండానే పింఛన్ మంజూరు చేసి ప్రతి నెలా 1వ తేదీనే ఇంటికి వచ్చి పింఛన్ ఇస్తున్నారు.

– మన్నేపల్లి వెంకయ్య, కొత్తపల్లి, కావలి మండలం

ఆర్థికంగా కొండంత అండ



నేను బేల్దారీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాను. నా ఆరోగ్యం క్షీణించి డయాలసిస్ చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూలి పనులకు వెళ్లలేక పోతున్నాను. నా పరిస్థితిని గుర్తించిన మా వలంటీర్ నా వివరాలు సేకరించి నాకు నెలకు రూ.10 వేల పింఛన్ వచ్చేలా చేశారు. ప్రతి నెల 1వ తేదీ ఉదయం వలంటీర్ అతని ఇంటి తలుపులు తట్టి పింఛన్ అందజేస్తున్నాడు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. ఈ ప్రభుత్వం నా కుటుంబానికి ఆర్థికంగా కొండంత అండగా ఉంది.

– ఇడింపల్ల కలగయ్య, కొత్తపల్లి, కావలి మండలం

రాజకీయ విలువలకు ఆనం తిలోదకాలు

- భావితర రాజకీయాలకు ఇదేనా మీ స్ఫూర్తి
- 'ఆనం' వ్యాఖ్యలపై వైఎస్సార్‌సీపీ నాయకుల ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చేజర్ల: జిల్లాలో రాజకీయ చరిత్ర కలిగిన కుటుంబ ప్రతినిధిగా, సీనియర్ రాజకీయ నాయకుడిగా పార్టీలు మారుతూ, మారే సమయంలో అధికార పార్టీలను విమర్శిస్తూ విలువకు తిలోదకాలు ఇస్తున్నారని ఆనం రామానారాయణరెడ్డిపై చేజర్ల మండల వైఎస్సార్‌సీపీ నేతలు విమర్శించారు. సీనియర్ రాజకీయ నాయకుడిగా పేరు ఉన్న మీరు భావితరాలకు మీరిచ్చే స్ఫూర్తి ఇదేనా అని నిలదీశారు. శనివారం చేజర్లలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి పలువురు పార్టీ నేతలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాను పాదయాత్ర నిర్వహిస్తున్న సమయంలోనే ప్రజలందరి కష్టాలను తెలుసుకుని నవరత్నాల పేరుతో మేనిఫెస్టోతో ప్రజలకు మేలు చేస్తున్నారని, తనకు మంత్రి పదవి ఇవ్వలేదని ఎన్నికల ఆఖరులో పార్టీపై, ముఖ్యమంత్రిపై ఆనం దారుణమైన విమర్శలు చేశారన్నారు. ఆది నుంచి అధికారమే పరమావధిగా ఆనం వ్యవహరించారన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి మరణించాక.. ఆయన ఆదరించిన నేతలందరూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట నడిచారన్నారు. కానీ ఆనం మాత్రం తన మంత్రి పదవి కోసం ఆ పార్టీలో చివరి వరకు కొనసాగారన్నారు. ఆ తర్వాత వైఎస్సార్‌సీపీలోకి రావడానికి ముఖం చెల్లక తెలుగుదేశంలో చేరి పోటీ చేసి ఘోరంగా ఓడిపోయారని గుర్తు చేశారు. అయినప్పటికీ మీ పెద్దరికాన్ని గౌరవించి వెంకటగిరి నియోజవర్గం నుంచి ప్రాతినిథ్యం వహించే అవకాశం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారన్నారు. నాలుగేళ్ల పాటు అధికారంలో ఉండి, మంత్రి పదవి ఇవ్వలేదనే పార్టీని వీడి వెళ్తూ ముఖ్యమంత్రిపై విమర్శలు చేయడం తగదన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్న సమయంలో మీరు చేసిన అభివృద్ధి ప్రజలకు తెలుసునని, అధికారంలో ఉండి కూడా సంగం, పెన్నా బ్యారేజీల నిర్మాణం ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. హైలెవల్ కెనాల్ నిర్మాణం ఎందుకు నత్తనడకన సాగిందని ప్రశ్నించారు. ఇప్పుడు ఆత్మకూరు నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేందటూ విమర్శించడం మీ స్థాయికి తగదన్నారు. దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి హయాంలోనే సంగం బ్యారేజీతో పాటు హైలెవల్ కెనాల్ వేగం పుంజుకున్నాయన్నారు. మెట్ట ప్రాంతంలో పారిశ్రామిక కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఇవన్నీ మీకు కనపడలేదనా అని నిలదీశారు. గౌతమ్‌రెడ్డి హఠాన్మరణంతో ఆయన సోదరుడు మేకపాటి విక్రమ్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచి అన్న బాటలోనే నడుస్తూ ప్రజలకు ఉపయోగపడే పనులు చేస్తున్నారన్నారు. ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరమ్ ఏర్పాటు చేసి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ, ప్రతి మండల కేంద్రాన్ని అభివృద్ధి పరుస్తూ, జాబ్‌మేళాలు ఏర్పాటు చేసి యువతను ప్రోత్సహిస్తున్నారన్నారు. పార్టీ నచ్చక పోతే వెళ్లి పోవచ్చని, కానీ ఇలాంటి దిగజారుడు విమర్శలు చేయడం ఆనం రాజకీయ గౌరవానికి తగదన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ పీర్ల పార్థసారథి, మండల జేసీఎస్ కోఆర్డినేటర్ పూనూరు బాలగంగాధర్ రెడ్డి, వైస్ ఎంపీపీ తిరుపతి నాయుడు మైనార్టీ నాయకులు ఎస్ మహమ్మద్ రఫీ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం. వెంకటరత్నం బోయిళ్ల మాలకొండారెడ్డి, రవీంద్రనాయుడు, తేళ్ల శేఖర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, సుందరరామిరెడ్డి, ఆనం ద్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



విద్యుద్దీపాలంకరణలో వెంగమాంబ దేవస్థానం



లడ్డూలు తయారు చేస్తున్న దృశ్యం



లక్ష్మీదేవి విద్యుత్‌కటౌట్

దుత్తలూరు: మండలంలోని నర్రవాడ వెంగమాంబ పేరంటాలు ఆదివారం నిలుపుతో ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి దేవదాయశాఖ అధికారులు, ఆలయ ధర్మకర్తలు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేశారు. వెంగమాంబ దేవాలయాన్ని విద్యుద్దీపాలంకరణతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. వివిధ దేవతామూర్తుల విద్యుత్ కటౌట్లు ఆకట్టుకుంటున్నాయి. బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తుల కోసం అమ్మవారి ప్రసాదం లడ్డూలు తయారు చేశారు. ఇప్పటికే దేవస్థానం ప్రాంగణంలో అంగళ్లు వెలిశాయి. వినోదాల కోసం రంగులరాట్నాలు, జెయింట్‌వీల్స్ తదితర ఏర్పాట్లు చేశారు.

దోమల మందు పిచికారీ



చేజర్ల (సోమశిల): అనంతసాగరం మండలం రేవూరులో ఉన్న బాలుర, బాలికల సంక్షేమ వసతి గృహం, సోమశిల గురుకుల పాఠశాల వసతి గృహంలో శనివారం దోమల మందు పిచికారీ చేశారు. దోమల నివారణ చర్యల్లో భాగంగా మలాథిన్ దోమల మందును పిచికారీ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఎం .చిన్నయ్య, హెల్త్ అసిస్టెంట్ అహ్మద్‌బాషా, అబ్దుల్ ఖాదర్ రేవూరు వైస్సార్‌సీపీ నేత నాగార్జునరెడ్డి ,గ్రామ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో వర్గపోరు

ఆత్మకూరు: ఆత్మకూరు టీడీపీలో వర్గపోరు మొదలైంది. కొన్ని పరిణామాల నేపథ్యంలో ఆత్మకూరు నియోజకవర్గ పెత్తనాన్ని ఆనం రామనారాయణరెడ్డికి కట్టబెట్టడంతో ఇప్పటి వరకు పార్టీ నమ్ముకుని అహర్నిశలు కష్టపడుతున్న కన్నబాబుకు సున్నం పెట్టినట్లైంది. పార్టీ ముఖ్య కార్యక్రమాలకు ఆయన్ను కరివేపాకులా వాడుకుని, ప్రస్తుతం ఆనంకు నియోజకవర్గ బాధ్యతలు, లోకేష్ పాదయాత్ర నిర్వహణ అప్పగించడంతో కన్నబాబు వర్గీయులు కినుకు వహించారు. ఆత్మకూరు పట్టణానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు ఇద్దరు టీడీపీ మైనార్టీ మాజీ కౌన్సిలర్లకు శనివారం ఫోన్ చేసి ఆనం సమావేశం ఆదివారం సాయంత్రం నిర్వహించనున్నట్లు ఆ సమావేశానికి తప్పని సరిగా రావాలని చెప్పారు. అయితే కన్నబాబు వర్గీయులైన ఆ మాజీ కౌన్సిలర్లు తమ నాయకుడు చెబితే తప్పని సరిగా వస్తామని చెప్పడంతో సదరు నాయకుడు బెదిరింపు ధోరణిలో వ్యవహరిస్తూ ఆనం మీటింగ్‌కు రాకపోతే టీడీపీ నుంచి తప్పిస్తామని, సమావేశానికి వస్తేనే టీడీపీ వ్యక్తులుగా గుర్తిస్తామని అన్నట్లు సమాచారం. దీంతో ఆ పార్టీ కౌన్సిలర్లు ఆయనకు ధీటైన సమాధానం చెప్పారు. రెండేళ్ల క్రితం జరిగిన మున్సిపల్ కౌన్సిలర్ ఎన్నికల్లో పార్టీని అమ్ముకుని కనీసం ఆ వార్డుల్లో పోటీ చేయలేక చేతులెత్తేసి వైఎస్సార్‌సీపీకి ఏకగ్రీవంగా కట్టబెట్టిన నువ్వేంటి మమ్మల్ని బెదిరించేది అన్నట్లు సమాచారం. దీంతో ఖంగుతిన్న ఆ నాయకుడు కిమ్మనకుండా ఫోన్ పెట్టేసినట్లు తెలిసింది.

పొనకా కనకమ్మ జీవితం స్ఫూర్తిదాయకం



మహిళా రక్తదాతలకు సన్మానం

కావలి: సామాజిక సేవారంగంలో పనిచేసే మహిళలకు తరగని స్ఫూర్తి పొనకా కనకమ్మ అని కావలి రెడ్‌క్రాస్ మహిళ విభాగం కన్వీనర్, ప్రముఖ మహిళా రక్తదాత పార్వతిశంకర్ అన్నారు. టీం సేవియర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రపంచ రక్తదాతల దినోత్సవాల్లో భాగంగా జిల్లాకు చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు పొనకా కనకమ్మ 132వ జయంతి సందర్భంగా శనివారం రెడ్ భవనంలో మహిళలు రక్తదానం, సీనియర్ మహిళా రక్తదాతలకు సన్మానం కార్యక్రమాలు నిర్వహించారు. పార్వతి శంకర్ మాట్లాడుతూ పొనకా కనకమ్మ తన జీవితాన్ని, ఆస్తులను సమాజ సేవకు, స్వాతంత్ర్య పోరాటానికి అంకితం చేశారని, పినాకిని గాంధీ సత్యాగ్రహ ఆశ్రమం, కస్తూర్బా విద్యా సంస్థలు స్థాపించారన్నారు. ఆమెకు భారతరత్న ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మహిళ రక్తదాతలు పార్వతిశంకర్, స్వర్ణలత, ఉమాశర్మ, షమారహీం, పద్మావతి, శేషమ్మ, వల్లూరమ్మను ఘనంగా సత్కరించారు. మేఘన, స్వర్ణలత ఆలపించిన సామాజిక గీతాలు సభికులను అలరించాయి. కార్యక్రమంలో టీం సేవియర్స్ సభ్యులు కీర్తి, పూజిత, ప్రేక్ష, ప్రణీత్ పాల్గొన్నారు.

పురోగతి లేని దర్యాప్తు

- కొలిక్కిరాని బృందావనం కాలనీ చోరీ

కావలి: ఎంత పెద్ద నేరం జరిగినా.. క్షణాలు.. లేదా రోజుల్లోనే నేరస్తులను పట్టుకునే సాంకేతిక సామర్థ్యం కలిగిన పోలీస్ వ్యవస్థ ఒక్క చోరీ విషయంలో అసమర్థతను ప్రదర్శిస్తోంది. పట్టణంలోని బృందావనం కాలనీలో జరిగిన భారీ చోరీ ఘటనకు సంబంధించిన దర్యాప్తు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. ఘటన జరిగి 50 రోజులు గడుస్తున్నా పురోగతి మాత్రం కనిపించడం లేదు. కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమెరాల నిఘా ఉండే బృందావనం కాలనీలో ఏప్రిల్ 16వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత భారీ చోరీ జరిగిన విషయం తెలిసిందే. కుటుంబ సభ్యులు ఇంట్లో నిద్రిస్తుండగానే దర్జాగా తలుపులు పగులకొట్టి ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు ఇంట్లోని నగలు, నగదుతో ఉడాయించారు. ఏ మాత్రం శబ్దం రాకుండా చాకచక్యంగా తలుపు తాళం విరగొట్టడంతో పాటు తాపీగా ఇంట్లోని నగలన్నీ బ్యాగులో సర్దుకుని మరీ బస్సెక్కి పారిపోయాడు. చోరీ ఘటనను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జిల్లా ఎస్పీ తిరుమలేశ్వర్ రెడ్డి స్వయంగా సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ కూడా ఆధారాల కోసం ప్రయత్నించింది. ట్రంక్ రోడ్‌లో ఉన్న నిఘా కెమెరాల్లో నిందితుడికి సంబంధించిన సీసీటీవీ పుటేజీలు కూడా లభించాయి. అయినా కూడా కేసు ఇంత వరకూ ఒక కొలిక్కి రాకపోవడం గమనార్హం. చోరీకి పాల్పడింది పాత నేరస్తుడే అనే పక్కా సమాచారం ఉన్నా నిందితుడిని అదుపులోకి తీసుకోవడంలో పోలీసులు మీనమేషాలు లెక్కిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఘటన తర్వాత కావలిలో వరుసగా చోరీ ఘటనలు చోటు చేసుకున్నాయి. కావలి పట్టణం నుంచి గౌరవరం వరకూ ఈ 50 రోజుల్లో 20కి పైగా చోరీలు జరిగాయి. తాళాలు వేసున్న ఇళ్లే లక్ష్యంగా దొంగలు చెలరేగిపోతున్నారు. ఒక్క ఘటనలో కూడా పోలీసులు ఇంత వరకూ పురోగతి సాధించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎస్పీ స్పందించి చోరీల విషయంలో పటిష్ట చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అనాథకు అంత్యక్రియలు



మృతదేహాన్ని వాహనంలో అంత్యక్రియలకు తరలిస్తున్న దృశ్యం

కావలి: సంయుక్త సేవా సంస్థ సభ్యులు ఓ ఆనాథకు శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. పట్టణంలోని బుడమగుంట సమీపంలో రోడ్డు పక్కన పూరిపాకలో జీవనం సాగిస్తున్న నిరుపేద గిరిజనుడు రాపూరి నరసింహ (32) అనారోగ్యంతో శుక్రవారం చనిపోయాడు. అంత్యక్రియలు చేసే స్థోమత లేకపోవడంతో మృతదేహం ఉబ్బిపోయి దుర్వాసన రావడంతో చుట్టు పక్కల వారు సంయుక్త సేవా సంస్థను ఆశ్రయించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర, సభ్యులు గంధం ప్రసన్నాంజనేయులు, ఎంవీఎస్ ప్రసాద్ రావు, ఎం. పరమేశ్వరి, శాంతి వర్ధన్, తన్నీరు రవికుమార్, జేవీ శారద, షేక్ మంజాన్ బీకే మానస, నల్లపరెడ్డి సాయి సౌమ్యరెడ్డి, ప్రశాంతి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య, బిడ్డ, తల్లి ఉన్నారు. గిరిజనుడైన నరసింహ మట్టి పనికి వెళ్లి కుటుంబాన్ని పోషించుకునే వాడు. సంపాదించే యాజమాని అనారోగ్యంతో మరణించడంతో తమకు దిక్కు లేకుండాపోయిందని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.